# పాతపర్సు - పాపాయి

త్రిపురాంబకి ఆరాత్రి నిద్రపట్టటంలేదు. తెల్లవారితే మొదటితేదీ. మొదటిసారి జీవితంలో జీతం తీసుకోబోతోంది. మొక్కుకున్న దేముళ్ళని నెమరు వేసుకుంటోంది. నేలమీద బొంతలో కుదించుకుపడుకున్న బామ్మమొహంలో దిగుళ్ళు చారల్లా వార్ధక్యానికి తోడుపలుకుతున్నాయి. కళ్ళ కింద గీతలో తడిమెరిసింది. పాపం ఎందుకు బాధపడిందో; ఈమధ్య అమ్మనోరు మరీ పెద్దదైంది. వాళ్ళ అక్కగారు ఈ వూరుకి బదిలీఅవటం మరీ ప్రమాదంగావుంది. మాట్లాడితే మావాళ్ళకేం అంటూ మొదలుపెడుతుంది. వాళ్ళకుంటే మనకేం ఒరిగింది అని తను అంటేనేగా అంత హంగామాచేసి తిండిమాని, తిట్టి, మాట్లాడ్డం మానేసింది.

పాపం బామ్మేగా, ఇద్దరికీ రాజీచేస్తా; పిల్లతో పట్టే మిటే అని అమ్మని బతిమాలింది. కన్నతల్లిపై కచ్చికడతావే పిచ్చితల్లి అని తనకిచెప్పి మాటకలిపింది. ఐనా అమ్మకి బామ్మంటే లోకువే. ఎప్పుడూ నాన్నకి ఏదో ఒకటిముట్టిస్తుంది. నాన్నచిరాకు చెప్పఖర్లేదు. "ఇదేం పెదపూడి అనుకున్నావా; హైదరాబాదే," అంటూ వున్నంతసేపట్లో వందసార్లు గుర్తుచేస్తాడు. చిరిగినపంచమీదకుట్టు గతాన్నికప్పుతోంది.

తాతయ్యవుండగా ఎప్పుడూ చుట్టుజరీచీరలే కట్టేది. కొప్పులోపువ్వులు, కళ్ళనిండాకాటుక, పావలాకాసుఅంత కుంకంతో, పచ్చటిమొహం పార్వతీదేవిలా మెరిసిపోయేది. మెళ్ళో బంగారంగొలుసులు కట్టలాచుట్టుకుని నిండుగా వుండేవి. అప్పుడు పెదపూడిలో మండువాఇల్లు పెళ్ళివారి ఇల్లులా వుండేది. పెద్దకుండెడుపాలు, కుండెడుపెరుగు, కవలపిల్లల్లా

చద్దులగదిలో నిండుగావుండేవి. ఆ డబ్బంతా ఏమైందో?

అక్కపెళ్ళి ఎంత వైభవంగా చేయించింది. అదే ఐశ్వర్యాన్ని వోమెట్టుదింపి దరిద్రాన్ని పైకిపిలిచిందేమో. అప్పుడు అమ్మేగా ఆపిల్లాడికిచ్చితీరాలని పట్టుపట్టింది. గొప్పవాళ్ళతో వియ్యమందితే తనకిఘనమని సోకాలెట్టడం గుర్తుకి వచ్చింది. పాపం బామ్మ వంటిమీదవున్న కాసులపేరు కరగించి అక్క వళ్లునింపింది. తాతయ్య బోసినోటితో అక్కయ్యనిచూసి నవ్వటం ఎంతబాగుండేది అప్పుడు. ఆ ఏడుతిరక్కుండానే తాతయ్య కన్నుమూశాడు. బామ్మనిర్మలమైన మనస్సు, అమాయకత్వం, కలిసి నాన్న మాటలు నమ్మేటట్లు చేశాయి. అమ్మ మరో అక్కభర్త మాటలునమ్మి భూమినమ్మి వ్యాపారం పెట్టించాడుట. మొదటబోలెడు లాభంవచ్చిందంటూ నాన్నకి కొంతడబ్బు ఇచ్చినట్లేఇచ్చి, మళ్ళీ భూములు బేరంపెట్టించాడుట. అప్పుడే పెద్దత్త వద్దనిఅడ్డుపడితే నాన్న ఆవిడని నానామాటలు అనటం, ఆవిడ మనసువిరిగి అప్పటికీ, ఇప్పటికీ మళ్ళా నాన్న గడపతొక్కలేదుట. అల్లావుండాలి అభిమానంగల మనిషంటే అనుకుంది. మళ్ళీ ఆలోచన నిలిపినచోటికి మనస్సు చేరింది. తరవాత అన్నీ అమ్మటమేకాని డబ్బు ఇవ్వటం తెలీదు. ఎల్లాగో ఈ ఇల్లుమాత్రం కొన్నాడట. దీనికి ఇంకాబోలెడు అప్పు ఉందిట. నిత్యం అమ్మతిట్టే తిట్లల్లో అప్పుగట్టాలన్న మాట ముందుంటుంది. అక్కయ్యది అదోరకంతరహా. అత్తారికి బోలెడువుంది. ఐనా అమ్మదగ్గర గారాలు చేసి ఖరీదైనబట్టలు కొనిపించుకుంటుంది. నాన్న మారు మాట్లాడకుండా అప్పుచేసైనా కొంటాడు. అక్కవస్తుందంటే, మిగిలినవాళ్ళకి వో ఏడాది అటూ ఇటూ ఏమికొనరు. కొనమంటే చీవాట్లే మిగులుతాయి. తనకి ఎన్నాళ్ళబట్టో టెర్లిన్‌లో జరీచీర కొనుక్కోవాలి అనివుంది. ఇంతవరకూ పడనేలేదు. మళ్ళీ సారి జీతం తీసుకోగానే కొనుక్కోవాలి అనుకుంది. బామ్మ మూలుగుతూ పక్కకితిరిగింది. ఏం బాధో? పాపం అస్తమానం ఏదోపని చేస్తూనేవుంటుంది. ఐనా అమ్మకితృప్తిలేదు. పక్కింటికాంతమ్మదగ్గర ఎన్ని చెపుతుందో బామ్మమీద. ఆవిడని చూస్తే వళ్ళుమండుతుంది. అమ్మకి సహంబుద్ధులు నేర్పేది ఆవిడే, అవిడనిచూసేగా అమ్మ బామ్మతొ మాట్లాడం మానేస్తా, బామ్మే పలకరిస్తుంది. ఆవిడకి కపటంతెలిదు. బామ్మకి కాస్తపూర్వకాలపు చేదస్తం వుంటేమటుకేం? అందరిమనస్సు కనిపెట్టి మెదులుతుంది. అంత ఆచారంవదలి ఈ గదిన్నరకొంపలో గడుపుకోవటం అంటే బామ్మని ఎంత మెచ్చుకోవాలి? అమ్మకి అదిలేదు. ఎంతసేపూ తనపుట్టింటి ఘనతచెప్పాలి. అదివినేందుకు తెలియనివాళ్ళుకావాలి. అందుకనే వెంకటమ్మ. అప్పుపెట్టి మేపుతుంది. ఆకాస్సేపు వినయంవలకపోసి బైటపడి ఎప్పుడూ వకటేసొద అనటం అమ్మమాత్రం వినకుండావుందేమిటీ;

ఈమధ్య వెంకటమ్మతో అమ్మకిచెడిందిట. కాంతమ్మ కంటే నిజాయితీవున్నది కనకే కాంతమ్మకిగిట్టదు. అమ్మని నమ్మించి, వెంకటమ్మకి తెలవకుండా వున్నవక్క వెడింకంచం మార్వాడీదగ్గర పెట్టించిందిట. బామ్మ నోరు నొక్కుకుంది. నాన్న గొణుక్కున్నాడు. పాపంబామ్మ రుద్రాక్షతావళంలోని బంగారంఅమ్మి కట్టించింది. నాన్నకి ఆకంచం పెట్టకపోతే బామ్మ గిలగిల్లాడుతుంది. అమ్మకి అదిగిట్టదు. అసలు ఆ కంచంపోతే కాని ఇంటికి శని పోదు అంటుంది. ఆలోచనలకి తుదిరావటం లేదు. పక్కింటి గోడపై పాకిన ఆనప్పాదు పైకి సూర్యకిరణాలు జారి పక్కకి జరుగుతున్నాయి. వళ్ళు విరుచుకుంటూ లేచింది త్రిపురాంబ.

నాన్న చెవులో పిల్లలపంచాంగం చదివే అమ్మ మొహం చూసింది. చిన్నచెల్లెలుకి రెండు జడలు కావాలంటూ ఇల్లు ఎగరకొడుతొంది. 'అరిచి మొత్తుకున్నా వెయ్యను అంటూ జుట్టుని పైకి దువ్విపట్టుకున్న తల్లి మొహం లోని కఠినత్వం చూడలేక బామ్మ పెరట్లోకి తప్పుకుంది.

అమ్మ వాదన తెమలకుండానే బామ్మ వంటింట్లోంచి పిలిచింది. గోడగడియారం పాతబడి అద్దం పగిలినా గంటలు కొడుతూనేవుంది. త్రిపురాంబకి వాకిట్లో కాంతమ్మ ఎదురయింది. "టిఫినీ మర్చిపోయేవే అమ్మడూ" అంటూ బామ్మ వెనక్కి పిల్చినా కాంతమ్మ మాటలతో అడ్డుపడి టైముని ముందుకు నెడుతోంది. 'బస్సు దొరకదు' అంటూ త్రిపురాంబ ముందుకు నడిచింది. మొదటి తేదీ, వికసించినా, ఉదయాన జేబులు ఖాళీగా చిల్లరని గలగల్లాడిస్తూ హుషారుగా తలెత్తి పక్కవాళ్ళని చూసే చైతన్యాన్ని ఇస్తుందేమో. ఎదర సీటులో కూర్చున్న గళ్ళకోటు ఆయన తనతో పాటు టిఫిన్, డబ్బాతోసహా నెలనించీ ప్రయాణం చేస్తున్నాడు. ఐనా ఎవర్నీ పలకరించటం చూడలేదు. కనీసం తలయెత్తి చూసినా గుర్తు రావటంలేదు. బస్సు ఆగుతోంది. దిగుతున్నారు - ఎక్కుతున్నారు. గుంపులో చోటు చేసుకుంటూ ముందుకి జరిగి దిగింది. ఎవరి చెయ్యో తగిలి జుట్టు రేగింది. సవరించుకుంటూ ఆఫీసు వరండామెట్లు ఎక్కింది. పెద్దగుమాస్తా చిన్నగుమాస్తా ఆలశ్యానికి అరుస్తున్నాడు. కాయితాలు గందరగోళం, అరుపులు, టైపుమిషను చప్పుడుతో కలిసిలయగా కదులుతోంది. త్రిపురాంబకి ఆరోజు పని తక్కువుంది. ఆ ఖాళీని తీరని కోరికలు చుట్టుకున్నాయి. అస్తమానం బామ్మ మొహం గుర్తుకి వస్తుంది. మాటలు నెమరువేస్తుంది. తనకెందుకు అంత యిష్టమో అర్థంకాదు. కాని, ఎప్పుడూ తను బామ్మకి ఏమీ ఇవ్వలేదు. ఈరోజు ఏదైనా కొనాలి.

బామ్మ అన్నట్టు ఎందుకొచ్చిన ఉద్యోగం; పెద్దత్తకి ఉత్తరం వ్రాసి, వాళ్ళ బావకొడుక్కి చేసుకోమని నాన్న అడిగితే ఎల్లా వుంటుందో. అమ్మ ఎప్పుడో చెప్పేసింది. పెళ్ళి కాకపోయినా ఫరవాలేదుట, కాని అత్తని అడిగేందుకు వీల్లేదని నాన్న నవ్వి సరేననటం జరిగి అప్పుడే ఏడాది తిరిగింది. అతను ఎల్లావుంటాడో బామ్మ కథలా చెపుతుంది. అమ్మ వినకుండా అక్కయ్య కూతురుకి పెళ్ళి చెయ్యాలని తొందరపడుతోందిట. అమ్మ కాంతమ్మగారికి గొప్పగా చెబుతోంది. 'బోలెడు డబ్బు, చక్కటి పిల్లా ఎగిరివస్తారు' అంటూ. ఆ రోజు బామ్మ మనపిల్లకంటే చక్కనిదేం కాదులే అనటంతో అమ్మమొహం చిన్నబోవటం గుర్తు కొచ్చింది.

ఎదటి బల్లమీద కాయితాలు తనకి పంపటంతో టైపు మిషన్ను కదిపింది. కుర్చీలు ఖాళీలు అవుతున్నాయి. కూర్చున్న చోటు వదిలినా కాలి తిమ్మెర నిల్చోపెట్టింది. ఆ రోజు జీతం తీసుకుంది. ఎన్నోసార్లు లెఖతిప్పుకుంది. పాతపర్సులో భద్రంగా పెట్టి చేతిగుడ్డ చుట్టింది. బామ్మచేతికి ఇవ్వాలి. ఏమంటుందో రేపు వో పర్సు కొనుక్కోవాలి. బస్సుస్టాపు పక్కన కొట్లో ఎన్నో తొంగి చూస్తున్నట్లున్నాయి. దూరంగా నైలాన్ చీర అమ్మాయి పెద్దబేగ్గుని వయ్యారంగా పట్టుకు నడుస్తోంది. తనకి అల్లా నడవటం ఎందుకు రాదో? బస్సు వస్తున్నది. గుంపులో చైతన్యం కదిలింది. కమ్మీలుపట్టుకు నిలుచున్నారు. ఈసారి గుంపుకి తనే నాయకురాలు. క్యూకి ముందుకు జరిగింది. వచ్చేబస్సు నెంబరుచూసి చికాకేసింది. మధ్యలో మారాలి. తనచోటు వదలటం ఇష్టంలేదు. దిగిమారితేపో ఏమనుకుంది. పర్సుని గట్టిగా పట్టుకుంది. ముందుకు జరిగింది. మధ్యవయస్సు తెల్లజుట్టు ఆయన చోటు ఇచ్చాడు. వదిగి కూర్చుంది. బామ్మ పెంపకంలో పెరిగింది. పరాయి వాళ్లు తగిలితే వళ్ళు జలదరిస్తుంది. జెట్టీని చూసినంత భయం. ఇంకా జరుగుతున్నాడు. సరీగ్గా కూర్చోమని చెపితే; కండెక్టర్ అందర్ని అదిలిస్తున్నాడు. చిల్లరకోసం పర్సు తెరవాలి, ఎవరైనా డబ్బునిచూస్తే - బామ్మ మాటలు చెవిలో మోగాయి. ఎవరికన్ను ఎటువంటిదో, ఐనా తప్పదు రాక్షసుడిలా కండెక్టరు దగ్గరనిల్చాడు. రూపాయి తీసింది. పక్కన కూర్చున్న పెద్దమనిషి పగలబడి నవ్వుతున్నాడు. చిత్రం ఆడాళ్ళకి ఎంతజాగ్రత్తో చూడండి. అంతా

వహటే తరహా. చదువుకున్నా మారరు అంటూ గుక్కపట్టి నవ్వుతున్నాడు. కండక్టర్ స్టాపులో డబ్బులు మాస్టారూ అన్నాడు. పక్కసీట్లో నల్లద్దాల పీచుజుట్టు అబ్బాయి మొహం ఇటితిరిగి వుంది. పర్సుని చూస్తున్నాడేమోనని భయంతో గట్టిగా పట్టుకుంది. కండక్టర్ గంటలా కదులుతున్నాడు. చాలామంది ముందుకి తోసుకుంటూ వచ్చారు. అత్తరువాసన వచ్చి మాయమయింది. ఎవరో కాలుతొక్కారు. వంగి చేత్తోరుద్దుకుంది. పమిట జరుగుతోంది. పర్సు చేత్తోపట్టుకుంది. ఎవరో తూలారు. పర్సు ఏమయింది? మాటరాలేదు. పర్సుపోయింది అన్న మాటలు వెనకసీట్లోంచి వినపడుతున్నాయి.

మనుషులు మాటలు గంద్రగోళం, ఎవరిదో దొరికింది. అదృష్టం. కేక వెనకనించి వచ్చింది. త్రిపురాంబ కంఠం గంటలా మోగింది- నాదే. ఆకారం చూడలేదు. తెరచిచూడాలన్న చైతన్యం ఏమయిందో? ఎదరసీట్లో నల్లద్దాలబ్బాయి తన పర్సు అంటున్నాడు. మళ్ళా గందరగోళం. జనం దిగుతున్నారు. గుంపులో కలిసి దిగింది. బస్సు హోరులో మాటలు కలిసి దూరమయింది. టాంకుబండమీద జంటలుగా నడుస్తున్నారు. ఈ జనానికి ఇంత తీరిక ఎక్కడిదో? తనలాగే ఇంటికి పోతున్నారేమో. పిల్లలు, పెద్దలు అక్కడక్కడ కార్లు. దిక్కులుచూస్తు నడుస్తోంది. తనదెబ్బకి గొడవ తొందరగా ఇల్లుచేరాలి; నల్లబుష్ షర్టు వివరాలు విసిగిస్తూ వెంబడించాడు. నాన్నచూస్తే ఏమవుతుంది. భయంతో రిక్షా ఎక్కింది.

ఇంటి ముందు బామ్మతో కాంతమ్మ ఘర్షణ పడుతోంది బామ్మ స్తిమితంగా చెపుతోంది. అమ్మడూ వోపాతిక ఇలా పడెయ్యవే అన్న కంఠంలో దర్జా తొంగిచూసింది. పర్సు విప్పింది. చేతిగుడ్డ చుట్టింది ఏమయింది చింపిరి జుట్టు నల్లద్దాల అబ్బాయి మొహం - భయంతో డబ్బు లెక్క పెట్టింది. తన జీతంకంటే రెట్టింపువుంది. చేతులు వణికాయి. వో పాతికే అన్న బామ్మ హెచ్చరిక. మొదటి జీతం ఇచ్చింది. మొదటి సారి బామ్మదగ్గర అబద్ధం ఆడుతోంది, ఆ అబ్బాయి కనపడితే ఏం చెప్పాలి. పాపం మొదటిజీతం ముడుపులు ఎన్నిచోట్లో. తల్లి హాస్పటల్లో వుందిట. ఎల్లా తెలుస్తుంది; బామ్మకి చెపితే ఏమంటుందో; కాలం సర్కసు గుఝ్ఝాల్లా తిరిగిపోతోంది. అమ్మకి నెలంతా విసుగే. మొదలు తేదీకోసం ఎదురుచూస్తోంది. త్రిపురాంబతో ఆప్యాయంగా ఆ రోజు మాట్లాడుతుంది. ఏవో చీట్లంటుంది, సరుకులు అంటుంది. పాపం బామ్మవి చిన్న కోరికలు - గుళ్ళో కుంకుంపూజు అభిషేకాలు, పటికిబెల్లం. అవేనా ఎప్పుడేనా అడుగుతుంది. నాన్న కూడా నెల చివర్లో అడుగుతున్నాడు. నాన్నకి ఇవ్వటం అమ్మకి గిట్టదు. అందర్ని తిడుతుంది, చీదరిస్తుంది. వాళ్ళ వాళ్ళ ఇంటికి వో పూట వెళ్ళి పోతుంది. వాళ్ళ పాతకార్లో దర్జాగా కూర్చుని కాంతమ్మ చూసేటట్టు గేటుముందు ఆపమని దిగుతుంది. ఆ రోజు అమ్మ చాలా గొప్ప బుద్ధులతో మాట్లాడుతుంది. పిల్లల్ని ప్రేమగా చూస్తున్నట్టు వుంటుంది. బామ్మని మర్యాదగా పలకరిస్తుంది. నాన్నకి వేడినీళ్ళు కాచిస్తుంది. మళ్ళా తెల్లవారి మామూలే. ఎంతప్రేమగా చూడాలన్నా మీ మొహాలు చూస్తే మండుకొస్తుంది. అంటూ పిల్లల్ని బాదుతుంది. మొదలు తేదీలు తిరుగుతున్నా నల్లద్దాల అబ్బాయి జాడ తెలవదు. త్రిపురాంబ మనస్సులో అతని పర్సులోకి డబ్బు మరో పది చేర్చాలి వచ్చే జీతంలో ఇచ్చేస్తుంది. దిగులు సహం తీరినట్లు వూపిరివస్తోంది. ఆరోజు అక్క దగ్గరనుండి వుత్తరం వచ్చిందిట. బంధువుల ఇంటికి వస్తోందిట. నాన్న అమ్మ దిగులు పడ్డారు. వాళ్ళ తాహతు పెరిగింది. పెద్ద బంగాళాలు కార్లు వున్నవాళ్ళు మనింట్లో ఏం సదుపాయం వుందని నిష్టూరపడ్డారు. అక్కని చూసి అలక మర్చిపోయారు. అక్క ఈసారి వో మెట్టు పైనించే మాట్లాడుతోంది. ఐతే త్రిపురకి ఏమి

ఇస్తున్నారేమిటి; మీ బావ పరసనల్ శక్రటరీకి ఇచ్చేదాంట్లో సగం కూడా లేదే; మర్చిపోయా వెళ్ళిపోవాలి. మరో ఎంగేజిమెంటువుంది. బామ్మకి అర్థంకాదు ఐనా అడగలేదు. అమ్మ కాంతమ్మని పిలిచింది. కాఫీ పెట్టింది. ఇంత లైటుగా తాగలేనమ్మా అంటూ అక్క కింద పెట్టేసింది. వాళ్ళకారు రంగుని గురించి బామ్మకి బోధించింది. బామ్మ వక్కమాటలో బూడిదరంగుకారు అని నామకరణం చేసింది.

బంగళా బేరానికే వచ్చారుట. త్రిపురా నువ్వు వస్తావేమిటే; అల్లా బజార్లోకెడదాం అన్న మాటలో అప్యాయత మిగల్లేదు అదిరాకేం అంతా మీ బామ్మ బుద్ధులు. అణా పైసలు లెఖకట్టుకుంటూ ఆ గుడ్డలు చూడు - కొనుక్కోకూడదంటూ అన్న తల్లిమాటలకి త్రిపురాంబ తెల్లబోయింది.

తన దగ్గర డబ్బు ఎక్కడ మిగుల్తోంది; అన్న ప్రశ్నకి జవాబు కళ్ళద్దాల అబ్బాయి పర్సు అమ్మ చూసిందేమో? గుండె వేగంగా పనిచేస్తోంది. మాటలు మారాయి. అక్క దర్జాగా కారులో వెళ్ళిపోయింది. అమ్మ తృప్తిగా పక్కవీధి డాక్టరుగారి కారుముందు నిల్చుని ఇందాక వచ్చిందే ఆ పెద్దకారు మా అమ్మాయిదే. అబ్బో తరగని ఆస్తి మా అల్లుడిది. మీకారు ఎంతకి కొన్నారేమిటి? అని ఆరాలు తీసి స్తిమితపడి వచ్చింది. నాన్న మనస్సులో ఏదో దిగులు నీర్సపడుతున్నాడు అంటూ బామ్మ కళ్ళు వత్తుకుంటోంది. అమ్మకి అక్కయ్య ఇంటికి వెళ్ళాలన్న ఉత్సాహం ఇంట్లో కనబడటం లేదు. పిల్లలు చదువులుమాని అమ్మలా మాట్లాడం నాన్నకి గిట్టటంలేదు. బామ్మకి వయస్సుతో చాకిరీ పెరుగుతోంది.

అక్కయ్య వచ్చినా కారు దిగటం లేదు. అహం ఆకాశానికి మెట్లు కడుతోంది.

కాంతమ్మ అమ్మని వెతుక్కుంటూ వచ్చేది. నాన్నతో మాటలు పెంచుకునేది. ఎప్పుడు వెళ్ళేదో బామ్మకే తెలవాలి. పిల్లలకంటే ముందు కళ్ళు మూతలు పడటం చూసి బామ్మ జాలిగా తిండి పెట్టి పంపేది. మళ్ళీ నెల తిరిగింది. ఇప్పుడు అమ్మకి డబ్బుల్తో పనిలేదు. కాని కాంతమ్మని రావద్దని ఖరారు చేసింది. తరవాత నాన్నే ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడు. బామ్మ నాన్నని బుజ్జగించింది. కోప్పడింది హబ్బ అని నోరునొక్కుకుంది. పెళ్ళీడు పిల్లని ఇంట్లో పెట్టుకునీకేం బుద్ధిరా అంది. నాన్న వినడని అమ్మని బుజ్జగించింది. ఈనగాచి చేను నక్కల చేసినట్టు, ఇదేమి బుద్ధే అంటూ దవడలు నొక్కుకుంది. పిల్లకి పెళ్ళి చెయ్యవా ఏం? అని నిలదీసింది. అమ్మ ఇంటిపట్టున వుంటోంది. అక్కయ్య రావటం తగ్గింది.

బామ్మ మళ్ళీ పెదపూడిలోలా పెత్తనం చేస్తోంది. నాన్నకి తెలవకుండా పెద్దత్తకి వుత్తరాలు రాయించి మంతనాలు జరిపింది. వోనాడు చెప్పా చెయ్యకుండా పెళ్ళి చూపులకి నాలుగు రిక్షాల జనం పార్సిలు పెట్టెల్లా దిగడ్డారు. బామ్మ మొహంలో సంతోషం ముడతలు మధ్య గంతులేసింది. అమ్మ ముభావంగా పనిలో వుంది. నాన్న లేని అర్భాటం తెచ్చుకు ప్రశ్నలు వేసి, ఆఫీసు టైమ్ అయిందంటూ వెళ్ళి పోయాడు. బామ్మ గదిలోంచి కదలద్దన్నట్టు కళ్ళు మెదిపింది. వో పెద్దావిడ ఎండినపూలు తీసి దూరంగా విసిరి గదిలోకి జొరబడింది నిక్షేపంలా వుంది పిల్ల. నేను అప్పుడే అన్నా చూసేది ఏమిటి? తల్లి చక్కనిదాయె, అత్తలు సరేసరి. అనాకార్లు ఆ ఇంట్లో పుట్టేందుకు ఆవటాని. మా వదిన రూపు చూడరాదు. ఈ వయసుకైనా తవలపాకల్లే మెరుస్తోవుంటుంది - అంటూ బామ్మని తెగమెచ్చుకుంటూ వంటింటి వేంపుకి వెళ్ళింది. అమ్మ దాన్ని ఆఫీసుకు వెళ్ళమంటారా అంటూ బామ్మని అడిగింది. అంత నెమ్మదిగా బామ్మతో మాట్లాడ్డం ఇదివరకు గుర్తులేదు. బామ్మ. వచ్చి నావిడా ఒకే కంఠంతో ఆ వెల్లమను అంటూ మాట కలిపారు.

నడుస్తున్నా, ఆ దొరికిన పర్సులోని పీచుజుట్టు అబ్బాయి మనస్సులో తిష్టవేశాడు. మళ్ళా కనపడితే ఏం మాట్లాడాలి అన్న ఆలోచనలు పాలపొంగులా పొంగుతున్నాయి. ఆఫీసు టైమ్ దాటింది. బస్సు ఖాళీగా రాక్షసుడి కంఠంలా గీ పెట్టుకుంటూ వచ్చి ఆగింది. పరి పరి విధాల మనస్సు పోతోంది. ఆ డబ్బు కోసం ఫోటో చూసేది. మొదట్లో మొహం చూస్తే బఫూన్ గుర్తుకి వచ్చేవాడు. కాలం జరిగినకొద్దీ దీనంగా డబ్బు అడిగినట్లు తోచి బాధ పడేది. ఆ రోజే బామ్మకి చెపితే ఏదో వుపాయం చెప్పేది. ఇప్పుడు ఏమి చెయ్యటం? వహవేళ అతనికి పెళ్ళి అయిందేమో. కాకపోతేమాత్రం చేసుకుంటాడన్న నమ్మకం ఏమిటి? వచ్చినవాళ్ళు వొప్పేసుకుంటే ఏం చెయ్యటం; తనకి ఇష్టం లేదని బామ్మకిచెపితే, ఎందుకని ఆరా తీస్తే ఏం చెప్పటం? పాలుపోవటం లేదు. అతను ఎక్కడా వుంటాడో; ఎల్లా కలవటం; ఇంత కాలం ఫోటోనికూడా తిప్పుతోంది. అనుబంధం అనురాగంలోకి జరుగుతోంది ఏమో. సిగ్గులాటిది మసగ్గా మనస్సుని కప్పుతోంది.

హెడ్ గుమస్తాకి ఆలస్యానికి కథ అల్లి చెప్పి తప్పుకుంది. పనీ చేసీ, చెయ్యక కాలాన్ని గడిపింది. పక్కసీట్లో అతను పిల్ల ఖర్చులని ఏ కరువు పెడుతున్నాడు. మరో సీటులో ఆయన ఎవరిని అడిగితే అప్పు దొరుకుతుందో అంచనా వేస్తూ త్రిపురాంబని అడిగాడు,. ఇచ్చేదాన్నే కాని, మా నాన్నకి అవసరం వచ్చింది అంటూ తప్పుకుంది. అందరి కంటే ముందు బయలు దేరింది. ఎదురుగుండా బొండాం శీను ఎదురయ్యాడు. అశుభం అనుకుంటూ వెనక్కి వచ్చి మర్చిపోని వస్తువు కోసం గాలించి బయలుదేరింది.

బస్సు కోసం క్యూ పెరుగుతోంది. తను మధ్య నున్నట్లు అనుకుంది. గుంపు కదిలింది. తనకి చివర సీట్లో చోటు దొరికింది. జనం సర్దుకుంటున్నారు, దిగుతున్నారు. ఎక్కుతున్నారు. నల్లద్దాల అబ్బాయి ఎక్కాడు, అతనే ఆ జుట్టు, ఆమొహం - పర్సు కొద్దిగా తెరచి చూసింది. పోలికని స్థిరపరుచుకుంది. అతనిని చూడటం మరొహతను చూస్తున్నాడు. అతను నిర్లిప్తతగా ఎటో చూస్తున్నాడు. అతని వెనకే తను దిగుతుంది. మాటలు ఎల్లా మొదలెట్టాలో తట్టటం లేదు. పర్సు వుందిగా హంస అల్లే అనుకుని తృప్తి పడింది. ఏదో తెలియని శక్తి తనలో తిరుగుతోంది. అతని వునికిని కళ్ళు విడవటం లేదు. బస్సు సడన్ బ్రేక్ పడింది. అతను కనపడలేదు. వెనకే, తెల్ల బట్టలతను దూకి నట్లు దిగాడు. తను నిల్చుంది. ఇది స్టాపుకాదు అంటున్నా వినకుండా దిగింది. ఏవో నవ్వులు, మాటలు వెనక వినబడుతున్నాయి. అతని కోసం మనస్సు తొందరపడుతోంది. పర్సుని పైకి తీసి పట్టుకుంది. క్షణంలో తన మనస్సు మొద్దుబారింది. బస్సులు, కార్లు సైకిళ్ళు - అన్నీ ఆగాయి. జనం గుంపులా చుడుతున్నారు. అనేక కంఠాలు ఏదో శబ్దం చేస్తున్నాయి. పోలీసులు, విజిల్స్ అన్నీ వింటున్నా స్థాణువులా నిల్చుని కదల్లేక చూస్తోంది. అతను బస్సుకింద రక్తంలో అనుకుంది.- అబ్బా, గుండె ఆగినట్టు బరువుగా కదులుతోంది. పాపం, ఈ పర్సు అనుకుంది. జనం పల్చబడ్డారు. తెల్లబట్టలాయన విచారంగా పెదిమ విరచాడు. మీకు తెలుసా, అతను? ఇదివరకు వకసారి నా పర్సు కొట్టేసి తప్పించుకున్నాడు. మళ్ళా ఈ రోజు ప్రయత్నించాడు, దొరకలేదు నే వెంటరావటం చూసి తప్పుకోలేక, అంటూ ఆగి, చేతిగుడ్డతో మొహం తుడుచుకున్నాడు. త్రిపురాంబకి కడుపులో దేవినట్టు అవుతోంది. అంత రక్తంలో మనిషిని పుట్టి పెరిగిన కాలంలో చూడలేదు. కళ్ళద్దాలు దూరంగా పడివున్నాయి. మొహం భీకరంగా తోచింది. ఇతని కోసమా తను పరితపిస్తా? ఏమో

మంచివాడేనేమో. ఈ తెల్లబట్టలు ఆయన చెప్పింది మాత్రం నమ్మేదెల్లా? మూగిన జనంలో కొందరు తనకేసి కసిగా చూస్తున్నారు. తనేం చేసింది? మెల్లిగా కదిలింది ఇల్లు చేరే సరిగి బామ్మ హడావిడిపడుతోంది. ఏం పిల్లవే బొత్తిగా ఇంగితం లేనిదానిలా ఇంత పొద్దుపోయా రావటం? నవ్వుతూనే మందలించింది. వట్టి వెఱ్ఱిబాగుల్ది. అంటూ బామ్మ మళ్ళీ జాలిపడింది. బంధువుల ఎదుట. నాన్న తెల్లబట్టలు కట్టుకున్నాడు.

"ఆ పిల్లాడు వస్తాడుట, లేచి మొహం కడుక్కో"మని మరోసారి చెప్పింది. తనకి ముస్తాబు అవ్వాలని లేదు. అసలు పెళ్ళే వద్దనాలని వుంది. కాని, వూరుకుంటారా! బామ్మ బతకనిస్తుందా! కాంతమ్మ వూరూరా టముకు వేయిస్తుంది. ఏవేవో పిచ్చి ఆలోచనలతో గదిలో చీకటి నల్లద్దా ల అబ్బాయిలా భయమేసింది.

ఈ సారి జడవిప్పి అమ్మే అల్లేసింది. మాట్లాడలేదు. కొత్తరంగు వేయించిన పాత పట్టుచీర పెట్టిపైన పెట్టింది. పెరటి గుమ్మంలో నీళ్ళు, సబ్బు పట్టుకు చిన్న చెల్లెలు నిల్చుంది. ఇంతమంది తన ముస్తాబుకి తాపత్రయపడుతున్నారు. ఎందుకో అనుకుని నిట్టూర్చింది.

"అమ్మాయిని పిలవమను" అంటూ వకావిడ చెప్పింది. హడావిడిగా తెమిలింది. తనకి ఇష్టమైన పూలు పెద్దచెండు గుచ్చింది. తల్లోపెట్టింది అమ్మ. దవనం వానస తనకి ఎంతో యిష్టం.

దవనం, కర్పురపుదండలు, కొత్తబట్టలు, గంధప్పొడి వీటిని ఎప్పుడు చూసినా అక్కయ్య పెళ్ళి గుర్తు కొస్తుంది. అమ్మ గొలుసుతీసి మెళ్ళోవేసింది. చిన్న చెల్లెలు బొమ్మలా బిగుసుకు నిల్చుంది. వచ్చినతన్ని రెప్పవాల్చకుండా చూస్తోంది.

త్రిపురాంబ తండ్రి పక్కన కూర్చుంది. తల వంచుకుంది. ఇప్పుడే వచ్చింది - కొంచెం అలసినట్లు వుంది అంటూ వెనక గుమ్మంలోంచి బామ్మ సర్దుకుంది. అంతేకాదులెండి అంటూ బస్సు కింద పడ్డ కుఱ్ఱాణ్ణి గురించి చెపుతూ, మీకు తెలుసా? అని నాన్నని అడిగాడు. ఆ ధోరణి నచ్చలేదు. ఎరిగివుంటే ఏం చేస్తావు? అనాలనిపించింది. కాని, బామ్మని చూసి వూరుకుంది. అబ్బే మాకు తెలవదుబాబు. అదేనా అట్టే మాటకారి కాదు. అందువల్ల ఎవరూ తెలవక పోవచ్చు. బామ్మే సమాధానాలిస్తోంది. బంధువులావిడ అతన్ని గురించి ప్రవర పలుకుతోంది. నా పెద్దపిల్లమీద గౌరవంతో వచ్చాడుతప్ప, అతనికేం లోటు. కలట్రా, ఏనా ఏమిటో నాకు సరీగ్గారావు అది అవుతుందిట తెలిసింది ! ఎంతెంత కట్నాలో పోస్తామంటూ తిరుగుతున్నారు.

'ఇంతకీ ఘటన ఎక్కడవుందో. అమ్మాయి పేరు, అవీ అడిగావా! అంటూ' అబ్బాయికి హుషారు ఇచ్చింది, ఆ చుట్టపు ఆవిడ.

అతను ఎందుకో మాట్లాడ్డం తగ్గించి పరీక్షగా చూస్తున్నాడు. 'తలెత్తు అమ్మడూ' అంటూ గెడ్డం పుచ్చుకుంది.

తనకి ఆ పెళ్ళి తప్పిపోతే బాగుండుననివుంది. కారణం తోచడం లేదు. వాళ్ళు వెళ్ళాక, అమ్మా, బామ్మ అంతా తలోసారి నచ్చాడా - అంటూ ప్రశ్నలు విడి విడిగా వేశారు. వారం తిరిగింది. పెద్దత్త పెద్ద దస్తావేజులాంటి వుత్తరం వ్రాసింది. సారాంశం చిన్నదే కాని, సంగతులు, జావార్లు ఎక్కువున్నాయి. నాన్న మళ్ళా ఆ మాట ఎత్తలేదు. బామ్మ నిలవనివ్వటం లేదు ఆ రోజు ఆఫీసునుంచి వస్తూంటే తెల్లబట్టలాయన ఘనంగా అమ్మాయిల

మధ్యనించి నడుస్తున్నాడు. తలవంచుకు నడుస్తోంది. అతనూ పరివారం చుట్టుకున్నారు. వాళ్ళ నవ్వులు, వెకిలి మాటలు, అన్నీ విని వెళ్ళాలంటూ వెనక్కి తిరిగింది, త్రిపురాంబ. అతను వాళ్ళని వదిలి తనతో నడుస్తున్నాడు. జనం పల్చగావున్న చోటుచూసి నిల్చి పిల్చాడు. దూరంగా కనబడే కొండరాళ్ళని చూస్తూ నిల్చున్నారు. పొడిమాటలు మొదలుపెట్టాడు. అతను, అంటే అని ఆగాడు. మళ్ళీ మొదలెట్టాడు. తెల్సుకోవాలిగా - అంటూ దీనంగా మొహం పెట్టాడు. మొగవాళ్ళు దీనంగా మాట్లాడితే గిట్టదు. తమ్ముడు అబద్ధమాడినపుడు ఈవెధవ మొహమే పెడతాడు. అసలు, ఇతనికి ఎందుకు చెప్పాలి? అని మనస్సు ప్రశ్న.. ఏదో చెప్పి వదుల్చుకుందాము అనుకుంది. మనస్సులో మా ట దాగలేదు. పర్సు బైటకి తీసింది. 'ఇదీ చుట్టరికం. నా మొదటి జీతం పోయింది. అతని పర్సు దొరికింది. అంతా నా కిచ్చారు పాపం, అతను ఏమనుకున్నాడో. నేను చూసేకోలేదు. ఇంటి దగ్గర చూశా. అప్పటినించీ మోస్తూ అతన్ని వెతుకుతున్నా' భ్రమరాంబ కంఠం బొంగురోయింది. 'నిన్న ఇద్దామనే వెంబడించా' కాని మాట రాలేదు. పర్సుని తీసుకున్నాడు. కళ్ళద్దాల అబ్బాయి ఫోటోని తునకలుగా చింపి గాల్లోకి విసిరాడు. తల్లిమందులు చూసి కళ్ళు వత్తుకున్నాడు. 'దేముళ్ళు ముడుపులు, అన్నీ దాచావే!' ఏకవచనానికి త్రిపురాంబ వళ్ళుమండింది. పైగా ఇతనిదేనన్న గుర్తేమిటి? పోనీ ఎవరిదైతే నేం తనకి భారం తగ్గింది. తీసుకోని అని సమాధానపడి వెళ్ళబోయింది. నిన్న చూసేనదగ్గర్నుంఉీ, అదే దిగులు. వాడితో, అన్న అతని మాట పూర్తికాకుండానే, ఛీ, అంటూ వెనక్కి తిరిగింది. ఇంటి మొహంపట్టినా ఆలోచనలు బరువుగా వెంబడించాయి. పెద్దత్తకి రాసి, పల్లెటూర్లో వుండే సంబంధం కుదర్చమంటా. ఈ ప్రాధేయతలు, ప్రేమలు, దిగులు, వూహలు, అమ్మాయిలు, అబద్ధాలు ఇవి తెలవని వరుడు కావాలని వ్రాస్తా. నీ మొహం - అని నవ్వి అత్త నామాట కాదంటే ఏం చెయ్యటం? బామ్మ మొహం వాకిట్లో చూసి అన్నీ మర్చిపోయింది.

ఇంట్లో మళ్ళీ వారం విరామం దొరికింది. పెళ్ళి మాటలు లేవు,. నాన్నకి పెదనాన్నకి ఘర్షణ పెరిగింది. బామ్మ ఇద్దరిమధ్యా సర్దుతోంది. బామ్మకి డబ్బుకంటే మాట గొప్పదిట. మాటమీద నిలవమంటుంది.

ఇద్దరూ వినమన్నారు. పెద్దమ్మ మంచమెక్కింది. అమ్మ మొహం చిన్నబోయింది. అక్కయ్య మళ్ళీ వస్తోంది. ఇప్పుడు నిచ్చెన దిగింది. అమ్మతో ఏవో రహస్యాలు, బామ్మతో ముచ్చట్లు, తనకి తెలియనివి ఎన్నో అమ్మకీ బామ్మకీ తెల్సు. తెల్ల బట్టలబ్బాయి వచ్చి బామ్మతో ముహూర్తం పెట్టించమన్నాడు. బామ్మ సంతోషంతో వుబ్బిపోయింది. అమ్మ వేదాంతిలా విని వూరుకుంది. నాన్న విన్నా చలనం లేదు. కాంతమ్మ మూతి విరిచిందిట. పెద్దత్త సంతోషంతో పెద్ద వుత్తరం బామ్మకి వ్రాసింది. తనని ఎవరూ అడగరా; ఎవరికి చెప్పాలి పెళ్ళి ఇష్టం లేదని. అతనికే చెప్పాలి. అతన్ని కలవాలి. ఆ రాత్రి తృప్తిగా నిద్ర పట్టింది.

బామ్మ పట్టు అన్నీ క్షణాలమీద జరగాలంటుంది. తెల్లవారేసరికి పేరిశాస్త్రులు వాకిట్లో వున్నాడు. వారం తిరక్కుండా ఎల్లా చెయ్యగలం అన్న నాన్న మాటలు గదిలోకి వినపడుతున్నాయి. నా మొహం అదే ఘటనంటే అన్నీ అవే వస్తాయి అంటూ అంచనాలేవేసి జాబితాలు రాయించేస్తోంది.

బామ్మతోనే చెప్పి ఈ హడావిడి ఆపాలి. త్రిపురాంబ ఇంట్లోకి బైటకి తిరుగుతోంది. బామ్మ మాటకి దొరకదు. ఎల్లా; తెల్ల బట్టలబ్బాయిజాడ పెళ్ళిరోజు వరకూ దొరకలేదు. తనకి

ఇష్టం లేదు అంటూ బామ్మ దగ్గర తెల్లారితే పెళ్ళి అనగా తేల్చింది. 'వెఱ్ఱి మొహమా ముందు ఎవరికైనా ఇష్టం వుంటుందే? అమూడు ముళ్ళూ పడ్డాక ఈ మాట చెప్పువింటాను అంటూ తృప్తిగా నవ్వుకుంటూ సందట్లో కలిసి పోయింది.

కాలం ఏనుగు నడకలా నిండుగా నడుస్తోంది. బామ్మ పేరు పాపాయికి పెట్టుకున్నా. బామ్మ చదువురాదు. ఐనా అందరి మనసులూ చదువుతుంది. ఎన్నో విషయాలు తేలిగ్గా చూస్తుంది. దిగులు పడదు. ఏదీ కోరదు.వక్క నాన్న కోసం బెంగ పడుతుంది. అదీ తన మాట వినక, తిండి తినకపోతే కళ్ళు వత్తుకుంటుంది. పాపం తెల్లబట్టలబ్బాయిని బామ్మేగా వప్పిస్తా. ఆమాట వప్పుకోదు బెట్టుచేసి బొంకుతారు. పాతపర్సు పెగిలించి పాప పైకి తీసింది. మా అమ్మదంటూ అతను దాచుకొంటాడు. మా అమ్మది అంటూ పాప ఏడ్చింది మామ్మది నీకేనే - అంటూ బామ్మ తీర్పు చెప్పి బోసి నోటితో నిండుగా నవ్వింది.

✧